క్లుప్తంగా

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని శ్రీకాకుళం ఆర్డీవో రంగయ్య అన్నారు. ఓటు అందరి హక్కని.. దాన్ని దుర్వినియోగం చేయరాదని చెప్పారు. మండల పరిధిలోని హయాతీనగరంలో ఓటు హక్కు వినియోగంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి ధర్మాన



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: ఒప్పంగి గ్రామదేవత అసిరి తల్లి అమ్మవారిని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం దర్శించుకున్నారు. గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిభావంతో క్రమశిక్షణ అలవడుతోందన్నారు. గ్రామ దేవత ఉత్సవాలతోపాటే జానపద కళారూపాల విశిష్టత వెలుగు చూస్తుందన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మంత్రి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

అయ్యప్పకు వెండి కిరీటం, రూ. లక్ష వితరణ



వెండి కిరీటం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలోని స్వామికి భాస్కరరావు దంపతులు వెండి కిరీటం అందించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం పునరుద్ధరణ కోసం మహిళా భక్తురాలు రాజేశ్వరి ఒక లక్ష రూపాయలు విరాళంగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు, అర్చకులు శంకరనారాయణశర్మ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రత్యేకాధికారి ఉషారత్నకుమారి సోమవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తల్లిదండ్రుల ఆధార్, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబర్‌తో సంబంధిత విద్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారమే అర్హులైన విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొత్తపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కొత్తపేట, ముద్దాడ, కొంగరాం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవి సోమవారం పరిశీలించారు. మండలంలో ఏర్పాటు చేస్తున్న 90 కేంద్రాలను పరిశీలించి ఎన్నికల బందోబస్తుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. నేర చరిత్ర ఆధారంగా ఇప్పటివరకు 107 మందిపై బైండో వర్ కేసులు నమోదు చేశామన్నారు.

చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలి



మాట్లాడుతున్న ఆర్వో లక్ష్మణమూర్తి

రణస్థలం: రాజకీయ పార్టీల వ్యక్తులకు సంబంధించిన నగదు, మద్యం, ఇతర బహుమతులు పట్టుబడిన వెంటనే ఎన్నికల అధికారులకు తెలియజేయాలని ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వి లక్ష్మణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఈబీ, పోలీస్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని జిల్లా అంతర్ చెక్ పోస్టులు పైడిభీమవరం, వెంకటాపురంలో నిఘా పెంచాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జే.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు, నాలుగు మండలాల ఎస్సైలు, ఎస్ఈబీ ఎస్సైలు పాల్గొన్నారు.

మదినిండుగా రంగుల పండుగ



గాయత్రి అపార్టుమెంటులో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



రెల్లివీధిలో రంగులు జల్లుకుంటున్న యువకులు

శ్రీకాకుళం కల్చరల్: రంగుల పండుగ హోలీని పట్టణంలో ఆనందోత్సాహాల మధ్య సోమవారం జరుపుకున్నారు. యువతీ, యువకులు, వృద్ధులు సైతం ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ సందడి చేశారు. కలెక్టర్ బంగ్లా, పాతశ్రీకాకుళం, ఏడురోడ్ల కూడలి, గుడివీధి, పాలకొండ రోడ్డు, హయాతీనగరం రెల్లివీధి తదితర ప్రాంతాలలో ఉదయం నుంచే హుషారుగా యువకులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ రంగులు జల్లుకుంటూ ఆనందంగా గడిపారు.

ఉత్సాహంగా మార్వాడీల హోలీ

పట్టణంలో సుమారు 150 కుటుంబాలు ఉన్న మార్వాడీలు ఒకే చోట చేరి హోలీ ఉత్సవాన్ని రాజస్థాని మిలన్ మంచ్ ఆధ్వర్యంలో ఆనందంగా జరుపుకున్నారు. వారి సంప్రదాయం ప్రకారం ముందురోజు రాత్రి న్యూకాలనీలోని బాలాజీ అపార్టుమెంటు వద్ద హోలికా పూజలు చేశారు. పెద్ద నెగడు వేసి పూజలు చేయడంతోపాటు చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. సోమవారం ఉదయం ఎస్ఆర్ఎంటీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసి, ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ హోలీని జరుపుకున్నారు. ఆడవాళ్లు, మగవాళ్లు నృత్యాలు చేసారు. కార్యక్రమంలో రాజేంద్ర కర్నాని, బాబూలాల్, మనోజ్, అమిత్, సందీప్ ఉన్నారు.

సందడిగా హోలీ వేడుకలు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యా సంస్థల్లో ఘనంగా హోలీ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్, చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల వసతి గృహంలో విద్యార్థులు ఉత్సాహంగా హోలీ వేడుకలు నిర్వహించారు.



శ్రీకాకుళం పట్టణంలో హోలీ సందడి..





విద్యుత్‌ను ఆదా చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యుత్‌ను పొదుపుగా వాడి ఆదా చేయాలని శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరంలో ఉన్న ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అన్నారు. శక్తి వనరుల వినియోగం, విద్యుత్‌ను ఎలా పొదుపు చేయాలో తెలుపుతూ ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి అధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థినులు గుజరాతీపేట వరకు ర్యాలీ తీశారు. విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేలా నినాదాలు చేశారు. అంతకుముందు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏటీపీ బి.లక్ష్మీకాంతం, ఎ.సుధారాణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన



ముద్దాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గొర్లె పరిమళ

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన వస్తేనే సంక్షేమ పాలన కొనసాగుతుందని ఎచ్చెర్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ అన్నారు. ముద్దాడ గ్రామంలో సోమవారం ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలన ప్రజలు చూశారని, మరోసారి సూపర్ సిక్స్ పథకాలు అంటూ ప్రజలను మోసం చేసేలా తప్పుడు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్ల పాలనలో నవరత్నాల వెలుగులు ప్రతీ కుటుంబంలో కనిపించాయన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేశారన్నారు. గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజాసంక్షేమ, అభివృద్ధి పాలన సాగిందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కిరణ్‌కుమార్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, నాయకులు బెండు రామారావు, బగ్గు రాజారావు, గుండ భాగ్యశ్రీ, మూగి ఈక్షిత తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లంటే టీడీపీ నాయకులకు భయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సాయికుమార్, తదితరులు

రణస్థలం: గ్రామ, వార్డు వలంటీర్లను చూస్తే చంద్రబాబు, టీడీపీ, జనసేన నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల మాట్లాడారు. టీడీపీ నాయకులు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ వలంటీర్లను కించపరిచేలా మాటలు అడుతున్నారంటే ఎంత కక్షతో ఉన్నారో అర్థం అవుతుందన్నారు. వలంటీర్లు గ్రామాల్లో వాళ్ల సొంత పనులపై తిరిగిన హడలెత్తిపోతున్నారని, కూటమి నాయకులకు రాత్రిళ్లు నిద్ర కరువైపోతుందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ సంక్షేమ పథకాన్ని, పింఛన్‌ను, రేషన్ సరుకులను వలంటీర్లతో ఇంటికి చేరవేస్తే ఆ వచ్చే ఆదరణ తట్టుకోలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. వలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, వలంటీర్లను అవమానకరంగా మాట్లాడుతూ వాళ్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. రూ.5 వేల గౌరవ వేతనంతో సమాజంలో నిస్వార్థంగా సేవ చేస్తున్నారని, కోవిడ్ మహమ్మారి సమయంలో టీడీపీ నాయకులు హాయిగా నిద్రపోతే ఇదే వలంటీర్లు గడపగడపకూ వెళ్లి సేవలందించారని కొనియాడారు. కులం, మతం, ప్రాంతం చివరకు ఏ పార్టీ అన్న బేధం లేకుండా అర్హత ఉంటే సంక్షేమాన్ని ఇంటికి చేరవేసేవారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.5 లక్షల మంది వలంటీర్ల సేవలను దేశమే కీర్తించిందన్నారు. వలంటీర్లపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం, జనసేన నాయకులు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, పార్టీ నాయకుడు మైలపల్లి కామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, మహంతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

జి.సిగడాం: మండలంలోని పలు గ్రామాల రైతులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు ఆధ్వర్యంలో సోమవారం అపరాల విత్తనాలు పంపిణీ చేశారు. పాలఖండ్యాం, సీతారాంపురం, గేదెలపేట, ఆనందపురం, సంతవురిటి గ్రామాల రైతులకు పాలఖండ్యాం గ్రామ సర్పంచ్ దారబోయిన రెయ్యమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధారబోయిన ధర్మారాజ్ సమక్షంలో ఉచితంగా పెసర, మినుము, నువ్వు విత్తనాలను అందజేశారు. రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు టంకాల మోహన్‌రంగా, కలిశెట్టి ఆది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీల్లో ప్రతిభ



ప్రాజెక్ట్‌తో చరణ్‌తేజ

జి.సిగడాం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీల్లో మండలంలోని డి.ఆర్.వలస జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న ఎం.చరణ్‌తేజ రెండో స్థానం కైవాసం చేసుకున్నాడని హెచ్ఎం కూర్మినాయుడు సోమవారం తెలిపారు. చెత్తాచెదారాన్ని శుద్ధి చేయడంపై ప్రాజెక్టను ప్రదర్శించారు. ఈ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. చరణ్‌తేజను ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

టైర్లు చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి అనుకుని ఫరీదుపేట గ్రామం కొయ్యరాళ్ల కూడలి పక్కన ఉన్న మెకానికల్ వర్క్ షెడ్‌లో ఆదివారం రాత్రి ఒక కొత్త, నాలుగు పాత టైర్లు చోరీ అయ్యాయి. పక్క ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. కారుపై వచ్చిన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని వర్క్ షెడ్ యజమాని ఫయాజ్ తెలిపారు. టైర్లు విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి డోలోత్సవం



డోలోత్సవం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమా రుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలుని ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో డోలోమండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలో ఉత్సవ మూర్తులను ఉంచి పూజలు నిర్వహించారు. మహిళా మండలి సభ్యులు సామూహిక లలితాసహస్రనామ పారాయణ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని పూజలు చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సుంకరి కృష్ణ, ఈవో సుకన్య పాల్గొన్నారు. అలాగే నాను బాలవీధిలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో డోలోత్సవం వేడుకలు జరిగాయి. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఉత్సవ మూర్తులకు ఊయలలో ఉంచి వేడుకలు జరిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



గార: లింగాలవలసలో పడిపూజ చేస్తున్న భక్తులు



గార: దీపావళిలో జ్ఞానాశ్రమంలో పూజ జరుగుతున్న దృశ్యం

గార: హరిహర సుత అయ్యప్పస్వామి జన్మనక్షత్ర వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. దీపావళి గ్రామంలోని ధర్మశాస్త్ర జ్ఞానాశ్రమంలో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వాములు రంగాభట్ల శ్రీనుగురుస్వామి, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి, శబరిమల అయ్యప్ప సేవాసమాజం కన్వీనర్ శ్రీరంగం మధుసూదన గురుస్వాముల ఆధ్వర్యంలో సామూహిక అఖండదీపారాధన, కలశ పూజ, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు రెండు వేల మందికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. అంపోలు పంచాయతీ లింగాలవలసలో పోలాకి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో పడిపూజ, చల్లపేట గ్రామాల్లో ఆలయాల వద్ద అయ్యప్ప పడి పూజ, అన్నసమారాధనలు జరిగాయి. గురుస్వాములు రుప్ప రమణ, మోయిల అశిరినాయుడు, కొర్ను రమణ, పంచిరెడ్డి రామకృష్ణ, బస్వా శ్రీనివాసరెడ్డి, శ్రీనుస్వామి, రౌతు సింహాచలం, చల్ల లక్ష్మీనారాయణ, లక్ష్మణరావు, బగ్గు మాధవరావు, చల్ల జగన్నాథం పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని పలు చోట్ల అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు జరిగాయి. బలగలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అర్చకులు శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రెడ్డి చిరంజీవులు, రాజారావు, భక్తులు పాల్గొన్నారు. పాతశ్రీకాకుళంలొని ధర్మశాస్తా ఆలయంలో అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు, అర్చన, హారతులు, మంత్రపుష్పం నిర్వహించి, అలంకరించారు. పడిపూజ, భజనలు జరిగాయి. పాలకొండ రోడ్డులోని కోదండరామాలయం వద్ద భక్తులకు స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు పులిహోర, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు



కారు డిక్కీలో బ్యాగులను తనిఖీ చేస్తున్న ఎస్సైగణేష్



వ్యాను రికార్డులను పరిశీలిస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. సోమవారం రాత్రి అరసవల్లి సమీపంలో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ వాహనాల తనిఖీ చేపట్టారు. లగేజీ వ్యాన్లు, కార్లు, ద్విచక్ర వాననాలను ఆపి రికార్డులను అడిగారు. వాహనాల్లో ఉండే బ్యాగులు, బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించారు.

అర్ధరాత్రి తరువాత..

జిల్లాకేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు వాహనాల తనిఖీ చేపట్టారు. భైరివానిపేట కూడలి సమీపంలో పెద్ద వాహనాలను, కార్లను పరిశీలించడమే కాక డ్రైవర్ల వద్ద ఉన్న వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఏఎస్ఐ శంకర్ ఉన్నారు.

27న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన భవనం

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బ్యాంకర్స్ కాలనీలోని సాయి బృందావనం మేడపై నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఈ నెల 27వ తేదీన ప్రారంభించనున్నారు. రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు దీన్ని ప్రారంభిస్తారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు



శ్రీకాంత్ శిష్యుల నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి తీరంలో పొన్నాడ బ్రిడ్జి వద్దగల ఇస్కాన్ జగన్నాథ మందిరంలో చైతన్య మహా ప్రభు ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణ, రుక్మిణీ ఉత్సవ మూర్తులకు అభిషేకాలు సోమవారం జరిగాయి. ఇస్కాన్ మందిరంలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో అద్భుత నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే కర్ణాటక సంగీత విద్వాంసులు డాక్టర్ సీహెచ్ రామకృష్ణ వీణ వాయిద్యం, మృదంగం బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మల కచేరీలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా మహాలక్ష్మీదేవి పూజలు



కోదండరామాలయంలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



పూజలందుకున్న సంతోషిమాత



నారాయణ తిరుమలలో మహాలక్ష్మికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలలో డోలా పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మీదేవి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పద్మావతి శ్రీనివాస కల్యాణ ఉత్సవం నిర్వహించారు. డీసీసీబీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక కుంకుమ పూజలు, దీపారాధనలు అర్చకులు చామర్తి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారికి పున్నమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు, శ్రీచక్రపూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాలకొండ రోడ్డులో ఉన్న కోదండరామాలయంలో డోలోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను మండపంపై ఉంచి వేడుకలు నిర్వహించారు. గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి శ్రీచక్ర పూజలు జరిగాయి. అర్చకులు చరణ్‌శంకర్‌శర్మ నేతృత్వంలో పౌర్ణమి పూజలు, అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. సుమారు 300 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది ఆలయ ధర్మకర్త మొదలవలస ఉషారాణి, జగన్మోహనరావు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను కలిసిన ఎంపీ అభ్యర్థి తిలక్



డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణమూర్తి, ఎంపీపీ రఘురామ్‌లతో పేరాడ తిలక్

గార: మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులను శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేరాడ తిలక్ సోమవారం కలిశారు. అంపోలు గ్రామంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్‌లను కలిసి రానున్న సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాతమ్మ, పార్టీ నాయకులను కూడా కలుసుకున్నారు. సర్పంచ్‌లు గొండు జయరాం, మార్పు పృథ్వీరాజ్, మళ్ల నరసింహామూర్తి, ఆరంగి వెంకటరమణ, శిమ్మ ధర్మరాజు ఉన్నారు.